**తొలిసంజె వేళలో సముద్ర కెరటాల మీంచి పైకి లేస్తున్న చంద్రుడు తాజాగా, కడిగిన పగడంలా వున్నాడు. ఆమె మోటల్ గదిలోంచి నిలువెత్తు అద్దానికి అడ్డంగా వున్న శాటిన్ కర్టెన్ తొలగించి చూస్తోంది. సముద్రపు ఒడ్డున గాలితాకిడికి వొళ్ళు విరుచుకున్న సరుగుడు చెట్టులా ఆమె బద్ధకంగా వొళ్ళు విరుచుకుంది. అతను గాఢనిద్రలో వున్నాడు. ఇప్పుడిప్పుడే లేచేట్టుగా కూడా లేదు అతని వాలకం చూస్తే.**

# సుఖాన్ని అన్వేషిస్తూ

కొమ్మిన ఉషారాణి



అతను ఒక కార్పొరేట్ కంపెనీలో బాధ్యతాయుతమైన పోస్టులో వున్నాడు. టెన్షన్స్ వుంటాయి. దానిని బ్యాలెన్స్ చేస్తూ సుగుణాలూ వుంటాయి. వైజాగ్ క్యాంప్‌కి వస్తూ పోనీ నువ్వు కూడా రాకూడదూ అంటూ తీసుకొచ్చాడు. ఇప్పుడు వాళిద్దరూ స్టార్ హోటల్‌లో వున్నారు. పెళ్ళై అయిదేళ్ళు అయింది. పిల్లా జెల్లా లేరని అటు వాళ్ళు, ఇటు వాళ్ళు తెగ ఇదై పోతుంటారు. కాని వాళ్ళు కావాలనుకుంటే యీ పాటికి ముగురో, నలుగురో పిల్లలు కాళ్ళకి, చేతులకీ అడ్డాలు పడుతూ వుండే వాళ్ళు.

సముద్రం అంచున ఉవ్వెత్తున లేచి పడే కెరటాలను చూస్తుంటే పెళ్ళైన కొత్త రోజులు గుర్తుకు వస్తాయి ఆమెకు. కాలేజీ రోజుల్లో అతన్ని మొదటిసారి చూసినపుడు ఆమె అతనిమీద తెగ ఆశ పడింది. మనసులో ఆవేశపడినా పైకి పొంగనీయకుండా శాయశక్తులా ప్రయత్నించేది. అతనసలు చూసీ చూడనట్లు ప్రవర్తించేవాడు. అప్పుడప్పుడు వుడుకుమోత్తనం వచ్చేది. నిజానికి అప్పట్లో కాలేజీలో అందమైన ఇద్దరు, ముగ్గురు అమ్మాయిల్లో తనూ ఒకత్తె. అతను క్లాసుమేటు కాదు. వరండాలోనో, మెట్లమీదో చాలా తరచుగా ఎదురయ్యేవాడు. మంచి డ్రెస్ సెన్స్ వుండేది. మంచి వొడ్డూ పొడుగూ బజర్దస్తీగా వుండేవాడు. ఏవేవో వూహలు చుట్టుముట్టేవి గుర్తుకు వచ్చినప్పుడు. వదిలించుకోడానికి తాతలు దిగివచ్చేవారు. డిగ్రీ పూర్తయి ఆ కాలేజికి గుడ్‌బై కొట్టేరోజు వెర్రి దిగులు వేసింది. ప్రేమ పెళ్ళి దాకా కాకపోయినా కనీసం రోజూ కనిపించే ఛాన్స్ కూడా లేదు కదా. అతను కనిపిస్తే చాలు తన మనసు అదుపు తప్పి తన ఇష్టం వచ్చినట్లు గిరికీలు కొట్టేది. అతనితో కలిసి రోజుకో కొత్త ఫీటు చేసేది.

ఎన్నెన్ని న్యూ ఐడియాస్ వచ్చేవో. . . మళ్ళీ ఎప్పుడైనా గుర్తొస్తే తనకే ఆశ్చర్యం వేసేది. ఆమె మీద ఆమెకు గౌరవం పెరిగేది.

రెండేళ్ళ తరువాత వొళ్ళు మనస్సు యింకాస్త గట్టిపడ్డాక ఆమె పెళ్ళైంది. ఆశ్చర్యం ఆమె పెళ్ళి అతనితోనే అయింది ! పేపరులో వరుడు కావాలని ఆమె తల్లిదండ్రులు ప్రకటన ఇచ్చారు. రాకుమారుల్లో అతను కూడా వున్నాడు. మళ్ళీ ఆమె మనస్సు ఫీట్లు చేయడం ప్రారంభించింది. పెళ్ళి చూపులకు వచ్చారు. అతను తనను చూడగానే పెద్దగా షాక్ అయినట్లు కనిపించలేదు. తను మాత్రం వుబ్బితబ్బిబ్బైంది. వాళ్ళు పిల్లనచ్చిందన్నారు. ఆ తరువాత పెళ్ళి, ఆ తరువాత కాపరం నెల తిరక్కుండానే అన్నీ. ఊహ నిజం కంటే అద్భుతంగా వుంటుందని అతను రుజువు చేశాడు. మునుపటిలా నా మనసు పిచ్చి పిచ్చి సర్కస్‌లు చేయడం తగ్గింది. జరిగిన వాటిని మళ్ళీ మళ్ళీ నెమరువేసుకోడానికి అలవాటు పడింది.

అతను చాలా తక్కువ మాట్లాడేవాడు. మాట్లాడిన కొంచెం సెన్సిబుల్‌గా మాట్లాడేవాడు. అతనెప్పుడూ ఆమెను ఆఖరుకు పెళ్ళైన కొత్తలో కూడా పొగడలేదు. పొగడ్తలను ఇంకో రకంగా భర్తీ చేసే అద్భుతమైన విద్య అతనికి తెలుసు. ఆ సంగతి గ్రహించడానికి ఆమెకు మూడు రాత్రిళ్ళ కంటె పట్టలేదు. జీవితంలో ఏవేవో మజిలీలుగా సిద్ధాంతులు వర్ణిస్తారు. కాని ఆమెకు ప్రతీరోజూ ఒక కొత్త మజిలీలో వత్తిగిల్తున్నట్లు అనిపిస్తోంది. ఒక మజిలీలో తను ప్రబంధనాయక వరూధినిలా అనిపిస్తుంది. మరొకసారి జీవితం కళాపూర్ణోదయం అవుతుంది. ఇంకో రాత్రి ఎంకిపాటగా మారిపోయి, గుండెల్లో గూడు కడుతుంది. యవ్వనంలో సున్నితత్వం లేదు. అది కోయిల పాట కాదు. అది సింహ గర్జన. ఆ వుద్రేకంలో సమస్తం వొదిగిపోయి వున్నాయి. సంగీతం వుంది, సాహిత్యం వుంది. నాట్యం వుంది. చిత్ర లేఖనం వుంది. తత్వ శాస్త్రం వుంది. భుజం మీద బలంగా చెయ్యి పడింది. ఆమె, ఆమె ఆలోచనలు ఒక్కసారి ఉలిక్కిపడ్డాయి. మరుక్షణం ఆమె అడుగెత్తు ఫోమ్ బెడ్ మీద వుయ్యాల లూగుతోంది.

" ఏయ్ . . ఏయ్ . . ఏంటి ఏంటి " అని చిత్రంగా అరుస్తోంది. ఫోమ్ బెడ్ సరే సరే అన్నట్లు వూగుతోంది.

" అటు చూడు . . సన్ రైజ్ ఎంత కలర్‌ఫుల్‌గా వుందో" అని అతని అటెన్షన్ డైవర్ట్ చెయ్యాలని చూసింది.

"డోంట్ టాక్ ఐసే. . . ఇంత దూరం వచ్చింది సన్ రైజ్ చూడడానికా. . . " అతని చేష్టకి " ఓవ్ " అని అరిచింది.

"జగమే వూయల వూగెనులే . .." అంటే ఏమిటో ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది, రూములో సితార్ వాద్యం తక్కువ వాల్యూమ్‌లో వినిపిస్తోంది. మరో వైపు టీవిలో భగవద్గీతపై స్వామీజీ ప్రవచనం వినిపిస్తోంది. అతనేదో చెవి దగ్గర నోరు పెట్ట గొణుగుతున్నాడు. అతనంతే. ఒక వీక్ మూమెంట్‌లో ఊ అనిపిస్తాడు. ఎక్కువ మాట్లాడకుండానే వీక్ మూమెంట్ తెప్పిస్తాడు. ఊ అంటే ఊ అనుకున్నాకిక తర్వాత వ్యాకరణం వుండదు. శ్రుతీ వుండదు. మతీ వుండదు. అతను అన్నాడు "డాళీ యిది కూడా ఒక సైన్స్. ఇదీ ఒక శాస్త్రమే. ఇదీ ఒక టెక్నాలజీయే. సుఖం కోసం అన్వేషణ – దానికోసం ఎన్నెన్నో దారులు వెదుకుతాం. ఆ వెతుకులాటకి ఒక అర్థం పరమార్థం వున్నాయి.

"షటప్ " అంది ప్రేమగా కొంచెం కోపంగా, కాస్తంత చిరాగ్గా, గదిలో వుద్రేకాలు, బింకాలు సడలినట్టు అనిపించింది. అతను కిటికీ వంక చూసి "చూడు సన్‌రైజ్ ఎంత ఫ్రెష్‌గా వుందో " అన్నాడు. ఆవిడ చూసింది. నిజమే సూర్యుడు ఇందాకటి కంటే ఇప్పుడు మరింత తాజాగా వున్నాడు. నీలం, ఎరుపు, పచ్చ, కొండరంగు అన్నీ కలిపి ఏ ఆకారమూ లేని వొక వర్ణచిత్రంగా ఆకాశం కాన్వాస్ మీద కనిపిస్తోంది. అది ఎంత చూసినా తనవి తీరనంత అందంగా వుంది.

"అదే మరి. ఆడా మగా కలిసినపుడు అజంతా కుడ్య చిత్రాల్లా మొదలై, కృతులూ, ఆకృతులూ లేని మోడరన్ పెయింటింగ్‌లా అయిపోవాలి" అంతా విని "ఛీ పాడు" అందామె.

"అంతేలే. అక్కడికి నీకు యిష్టం లేనట్టూ, నేను మొహం వాచి అఘోరిస్తున్నట్టూ" అన్నాడు దగ్గరగా వస్తూ.

"నో. . . నో ... నువ్వన్నది కరెక్ట్. అది ఒక వర్ణింపసాధ్యంకాని కళాఖండం" అన్నదామె అతనిలో వొదిగిపోతూ.



# ఈ బస్సుల స్టైలే వేరు

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ సిటీ బస్సుల రూటే వేరు. ఏ ప్రయాణికున్నీ విసిగించవు. తమ సమయాన్ని తప్పకుండా పాటిస్తాయి. ఇంకో విశేషమేమంటే ఇప్పుడెక్కడున్నా మనం ఫోన్ చేస్తే చాలు ఫలానా చోట వున్నదని వెంటనే సమాధానమిస్తారు. ఇక ప్రతి బస్సుకూ రూటు నెంబరుతో పాటు బస్సు ఫోన్ నెంబరూ వుంటుంది. బస్సుల్లో టూరిస్టు గైడ్‌లు కూడా వుంటారు. వారికి ఫిక్స్‌డ్ రేటు వుంటుంది. అంతకుమించి ఒక్కపైసా కూడా తీసుకోరు. ఒకవేళ తీసుకున్నా వెంటనే జైలు కెళ్ళాల్సిందే. రైల్వే లైన్స్ లేని ప్రతి ఏరియాలోనూ బస్సు రూటులుంటాయి. సిటీ బస్సుల్లో కూడా రకాలున్నాయి. ఇందులో చైర్ బస్సులు, స్లీపింగ్ బస్సులూ, ఏసి బస్సులూ, సూపర్ కంఫర్టబుల్ బస్సులూ వున్నాయి. ఎక్కడైనా బస్సు లేటయినా, డ్రైవర్ స్పీడుగా డ్రైవింగ్ చేయ లేకపోయినా వెంటనే సిటీ బస్ సర్వీసుకు ఫోన్ చేసి, అక్కడ సరైన సమాధానం దొరక్కపోతే వినియోగ దారుల ఫోరంలో వేయచ్చు. మెల్‌బోర్న్ సిటీ బస్సుల్లో స్టాండింగ్‌లో వెళితే మనకు ఫైన్ వేస్తారు. మరో విషయమేంటంటే అక్కడ ఆడ మగ అందరూ సమానమే. ఆడాళ్లకు ప్రత్యేకమని సీట్లపై రాసి వుండదు. ఎక్కడైనా బస్ రిపేరు వచ్చినా, మరేదైనా కారణాల వల్ల ప్రయాణీకులకు ఇబ్బంది కలిగితే నష్టపరిహారం కింద కొన్ని డాలర్లు ఇచ్చేస్తారు.

ఈ బస్సుల్లో ప్రయాణించడానికి ప్రత్యేక టికెట్ కౌంటర్లుంటాయి. లేదా ఆన్‌లైన్ బుకింగ్ కూడా చేసుకునే వీలుంది. మెల్‌బోర్న్ సిటీలో ఎక్కువగా రెడ్ డబల్ డక్కర్‌లు, బ్లు డబల్ డక్కర్ బస్‌లూ వుంటాయి. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయితే మాత్రం ఆర్టీసీ వాళ్లు ట్రాఫిక్ వాళ్ల పని పడతారు. ఎవరి వల్ల జామ్ అయిందో తెలుసుకుని సదరు వాహనదారుని మీద ట్రాఫిక్ వాళ్లు విరుచుకు పడతారు. మెల్‌బోర్న్ సిటీ బస్సుల్లో టీవీలూ, మూవీలు చూడచ్చు. టీవీల్లో మూవీలు రాకపోయినా టికెట్ డబ్బుల్లో కన్సెషనే. అందుకే మెల్‌బోర్న్ సిటీ బస్సులను రోడ్డుమీద తిరిగే విమానాలంటారు.